



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మహేష్



పింఛన్ల పండక్కి రెడీ

ఆగస్టు పెన్షన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు..
2,43,402 మంది లబ్ధిదారులకు రూ.101 కోట్ల 30 లక్షలు పంపిణీకి సిద్ధం
4,258 మంది సిబ్బంది నియామకం
పెన్షన్ల పంపిణీపై కలెక్టర్ మహేష్‌కుమార్ వీడియో కాన్ఫరెన్సు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు ముందు పెన్షన్ పంపిణీలో చోటుచేసుకున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని 1వ తేదీన పెన్షన్ల పంపిణీకి జిల్లా అధికార యంత్రాంగం పగడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే పెన్షన్‌దారులను మ్యాపింగ్ చేసి 1వ తేదీనే నూరుశాతం పెన్షన్ల పంపిణీ పూర్తిచేసే విధంగా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం జిల్లా అధికార యంత్రాంగంతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి సూచనలు చేశారు. ఆగస్టు 1వ తేదీన పెన్షన్ల పంపిణీ నూరు శాతం పూర్తి అయ్యేలా మండల, గ్రామస్థాయిలో కార్యాచరణను సిద్ధం చేసుకోవాల్సిందిగా సూచించారు. సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే తప్ప మిగిలిన పెన్షన్లు అన్నీ లబ్ధిదారులకు అందించేలా చూడాలని ఆదేశాలు అందాయి. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ప్రక్రియలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 28 కేటగిరీలకు సంబంధించి 2,43,402 మంది లబ్ధిదారులకు గాను రూ.101 కోట్ల 30లక్షలు పంపిణీ చేయనున్నారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం 5 గంటల నుంచి ప్రారంభించి సాయంత్రానికి పూర్తి చేయాలని, సాంకేతిక సమస్య ఉత్పన్నమైతే వాటిని రెండో రోజు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇంటింటికీ ఈ పెన్షన్ల పంపిణీకి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 4,258 మంది సిబ్బందిని నియమించినట్టు కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటికే పింఛనుదారులతో మ్యాపింగ్ చేసినట్టు పేర్కొన్నారు. ఒకవేళ పెన్షన్లు పంపిణీ చేయని పక్షంలో అందుకు గల కారణాలను సంక్షేమ సహాయకులు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. గతంలో నియమించిన సిబ్బందితో పాటు అదనపు సిబ్బందిని కూడా ఇందుకోసం నియమించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండో నెల పెన్షన్ల పంపిణీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్ణీత సమయానికి లబ్ధిదారులందరికీ అందేలా కృషి చేయాలన్నదే జిల్లా యంత్రాంగం లక్ష్యంగా కనిపిస్తోంది..

నివేదికలతోనే సరి

లంక గ్రామాల ప్రజలను వరదకొదిలేస్తున్నారు..
శాశ్వత పరిష్కారాలు చూపని ప్రభుత్వాలు
ప్రతిపాదనలకే పరిమితమవుతున్న పనులు
ఏ పని మొదలెట్టినా మధ్యలోనే నిలుపుదల



జొన్నలంకలో నదీపాతానికి గురవుతున్న కొబ్బరితోటలు



ఎదురిబిడిం కాజ్‌వేపై పడవ దాటుతున్న లంక గ్రామస్తులు

పి.గన్నవరం, జూలై 30: వరదల సమయంలోనే లంక గ్రామాలు, ఏటిగట్లు, గ్రోయిన్స్ నిర్మాణాలు, కాజ్‌వేల నిర్మాణం తదితర అంశాలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు అంచనాల రూపకల్పనతో హడావిడి చేస్తుంటారు. వరదలు తగ్గిన వెంటనే వాటిని పట్టించుకునే నాథుడే ఉండడు. కనీసం స్థానిక ప్రజానీకానికి కూడా వాటి మాటే గుర్తుండదు. గోదావరి వరదలు నేపథ్యంలో ఆయా గ్రామాలకు, ఆస్తులకు నష్టం రాకుండా పలు అంశాలపై ప్రత్యేకమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపించాల్సి ఉంది. ముఖ్యంగా కాజ్‌వేల నిర్మాణాలు చేపడితే రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది. గ్రామాల్లో వరదనీరు చుట్టుముడితే ప్రజలకు ఇబ్బందులు లేకుండా తుఫాన్ షెల్టర్ల మాదిరిగా ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. వరదల సమయంలో ఆస్తులు ధ్వంసం కాకుండా కాపాడుకోవడానికి గోదావరి నది చెంతనే గ్రోయిన్స్ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. తద్వారా పంట భూములను కాపాడుకోవచ్చును. జిల్లాలో పలుచోట్ల ఏటిగట్లు ఇంకా బలహీనంగానే ఉన్నాయి. వాటిని పటిష్టపరిస్తే గోదావరి ఉగ్రరూపం దాల్చినప్పుడు భారీ ప్రమాదాలు నుంచి బయటపడవచ్చు. జిల్లాలోనే పి.గన్నవరం నియోజకవర్గంలో ఎక్కువశాతం లంక గ్రామాలు ఉన్నాయి. అంబాజీపేట మండలం మినహా పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో వరద బెడద అధికంగా ఉంది.

తాత్కాలిక పనులతో సరిపెట్టేస్తున్నారు


2022 వరదల సమయంలో పి.గన్నవరం మండంలోని లంకలగన్నవరం, మానేపల్లి, నాగుల్లంక గ్రామాలతో పాటు రాజోలులో ఏటిగట్లు బలహీనంగా ఉన్నాయని గుర్తించి తాత్కాలికంగా ఇసుక బస్తాలతో వరదలను నెట్టుకొచ్చారు. ఆ సమయంలో వరద రెండు నుంచి మూడుసార్లు రావడంతో జిల్లాలో అనేక చోట్ల ఏటిగట్లు హడావిడి చేశాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఏటిగట్లు పటిష్టత నిమిత్తం నివేదికలు అందించాలని హుకుం జారీ చేయడంతో హడావిడిగా నివేదికలు అందించారు. ఇప్పటి వరకు వాటి ఊసేలేదు. అలాగే పి.గన్నవరం నియోజకవర్గంలోని అయినవిల్లి మండలం తొదరపాయ వద్ద ఎదురిబిడిం కాజ్‌వే ప్రతిపాదనలకే పరిమితమయ్యింది. సంబంధిత అధికారులు రూ.13 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపితే ఇప్పటివరకు పట్టించుకున్న నాథుడు లేడు. కె.ఏనుగుపల్లి, అప్పనపల్లి కాజ్‌వేలు కూడా నివేదికలకే పరిమితమయ్యాయి. కె.ఏనుగుపల్లిలో వరదల సమయంలో కాజ్‌వేపై నుంచి వ్యక్తి కొట్టుకుపోతే నివేదికలు సిద్ధం చేసి పంపించాలని అప్పట్లో ప్రభుత్వం హడావిడి చేసి తర్వాత మరిచింది.

ఎప్పటికి పరిష్కారం దొరుకునో..

అప్పటి వైసీపీ ప్రభుత్వం సుమారు రెండు సంవత్సరాలు క్రితం ఉమ్మడి జిల్లాలో నదీకోతలపై అధ్యయనం చేసి సంబంధిత నివేదికను సమర్పించాలని టెక్నికల్ ఎడ్వజర్ కమిటీ (టీఏసీ)ని ఏర్పాటు చేసింది. అప్పట్లో ఉమ్మడి జిల్లాల్లో ఐదుగురు సభ్యులతో కూడిన టీఏసీ బృందం స్థానిక అధికారులు సహాయంతో పర్యటించి నదీ కోతలను స్వయంగా పరిశీలించింది. అయితే ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీ పరిశీలనతో ఏం చర్యలు తీసుకుందో తెలియదు. కమిటీ మాట దేవుడెరుగు కనీసం ఏటా స్థానిక అధికారులు పంపిన ప్రతిపాదనలు సైతం పక్కన పెట్టడంతో వరదల సమయంలో వ్యయసాయ భూములు నదీపాతానికి గురవుతున్నాయి. ప్రతిపాదనలు పరిశీలించి ఈ ఏడాది వేసవిలోనైనా నదీకోత నివారణకు గ్రోయిన్లు ఏర్పాటు చేస్తారా...అంటూ రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.



కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద బలహీన పడ్డ ఏటిగట్టు



కె.గంగవరం మండలం సుందరపల్లి వద్ద కోతకు గురవుతున్న ఏటిగట్టు

ఏటిగట్లు బలహీనం

● (మండపేట)

ప్రతి ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో వరదలు వస్తుంటాయి. ఈ రెండు నెలలు పాటు కోనసీమ జిల్లాలోని లంక ప్రాంత ప్రజలంతా కంటిమీద కునుకు లేకుండా ఉంటారు. ఏటిగట్లు బలహీనపడిన చోట చోట గోదావరి వరదనీరు లీకులవుతుండటంతో తో అక్కడ యుద్ధప్రాతిపతికన చర్యలు చేపట్టడం జరుగుతుంది. కానీ ప్రమాదాలు నివారణకు సంబంధించి శాశ్వత రక్షణ చర్యలు చేసిన దాఖాలాలు లేకపోవటం గమనార్హం.

రక్షణ గోడలా ఏటిగట్లు

గోదావరి వరద నుంచి గ్రామాలను కాపాడేందుకు ఏటిగట్లు రక్షణ గోడలా నిలబడతాయి. ఏటిగట్లు పటిష్టంగా ఉన్న చోట ఆయా ప్రాంత వాసులు గుండెల మీద చేయి వేసుకుని పడుకుంటారు. బలహీనంగా ఉన్న చోట మాత్రం వారికి కంటి మీద కునుకు ఉండదు. ఏ సమయంలో గోదావరి ప్రవాహం ఎలా ఉంటుందో..ఏటిగట్ల పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన వారిని ఆవహిస్తుంది. ముఖ్యంగా కోనసీమలో పలు ఏటిగట్లు బలహీనపడుతూ వస్తున్నాయి. వరదల సమయంలో గట్లను పర్యవేక్షించే సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడంతో సమస్య ఏర్పడుతోంది. అలా ఉన్న ఏటిగట్లకు కేవలం వరదల సమయంలోనే తాత్కాలిక మరమ్మతులు చేయించి చేతులు దులుపుకుంటున్నారు. తర్వాత ఏటిగట్లను గాలికొదిలేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ గోడలా నిలిచే ఏటిగట్లను శాశ్వత ప్రాతిపదికన బాగు చేయాలనే స్పృహ అటు నాయకుల్లో కానీ ఇటు అధికారుల్లో కానీ ఉండడం లేదు.

బలహీనంగా..

ఆలమూరు, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రావులపాలెం, కొత్తపేట, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు, అల్లవరం, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, అమలాపురం, ఐ.పోలవరం, ముమ్మిడివరం మండలాలు వరద ప్రభావానికి గురవుతాయి. గోదావరి ప్రవహించే చోట ఏటిగట్ల పొడవునా 60 వరకు లంక గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో గల కె.గంగవరం మండలంలో కోటిపల్లి ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో గల కూళ్ల, సుందరపల్లి రెండు చోట్లా 900 మీటర్ల మేర ఏటిగట్లు దెబ్బతినటంతో తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టారు. అలాగే ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో అన్నంపల్లి ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో గల పల్లంకుర్రు శివారు బూలవారి మొండి వద్ద కొంత మేర ఏటిగట్టు బలహీనపడటంతో తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టారు. ఇలా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఏటిగట్లు చాలా బలహీనంగా ఉండడంపై ముంపు గ్రామాల వాసులు ఆందోళన చెందుతున్నారు..



కోటిపల్లి ఇరిగేషన్ కార్యాలయం వద్ద వరద రక్షణ కోసం ఇసుక బస్తాలు పడుతున్న కూలీలు..

430 కి.మీ విస్తీర్ణంలో

జిల్లాలో 430 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఏటిగట్లు ఉన్నాయి. అయితే వాటిని పర్యవేక్షించి ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాల్సిన లస్కర్ల కొరత తీవ్రంగా ఉంది. 2006లో సంభవించిన వరదల నేపథ్యంలో అప్పట్లో రూ.534 కోట్లు విడుదల చేశారు. 2007లో మొదలైన ఆధునికీకరణ పనులు 2012 వరకు చేశారు. అప్పుడు మాత్రమే కొన్నిచోట్ల ఏటిగట్లను పటిష్టం చేశారు. అయితే మరికొన్ని చోట్ల పనులు పూర్తికాని పరిస్థితి ఉంది. జిల్లాలో ఏటిగట్లను డబ్ల్యూబీఎం రోడ్లుగా మార్పుచేశారు. 2012 తర్వాత ఏటిగట్ల పరిస్థితిని మార్చే ఎటువంటి పనులు చేయలేదు. 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వం ఏటిగట్ల ఆధునికీకరణకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. కేవలం వరదల సమయంలో మాత్రం అత్యవసర పనుల కోసం అవసరమైన వరద రక్షణ సామగ్రి జిల్లా కలెక్టర్ మాత్రం నిధులు విడుదల చేస్తున్నారు.. ఇరిగేషన్ శాఖ అయితే వరదల సమయంలో ఏటిగట్ల పటిష్టానికి అవసరమైన ఇసుక బస్తాలు, సరుగుడు కర్రలు, సంచులు ఇతర సామగ్రి సమకూర్చుతుంది.

రూ.247 కోట్లతో అంచనాలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో జిల్లాలో ధవళేశ్వరం ఇరిగేషన్ పరిధిలో 19 అత్యవసర పనులను గుర్తించి రూ.247 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి అధికారులు పంపించారు. వాటిలో ఉభయగోదావరి జిల్లాల్లో ఎనిమిది చోట్ల ఏటిగట్లను పటిష్టం చేయడంతో పాటు ఎత్తు చేయడం గ్రోయన్ల నిర్మాణం తదితర పనులకు సంబంధించి రూ.218.66 కోట్లు, ఆరుచోట్ల ఆవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మాణ మరమ్మత్తుల కోసం రూ24.22 కోట్లు, మీడియం సాగునీటి వనరులు నిర్వహణ కోసం రూ.4.15 కోట్ల మేర నిధులు అవసరమని ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి అధికారులు నివేదించారు.

> జిల్లాలో పలుచోట్ల బలహీనంగా ఏటిగట్లు
> వరద సమయంలో భయపెడుతున్న వైనం
> వైసీపీ ప్రభుత్వంలో ఆధునికీకరణకు మొండిచేయి
> కూటమి ప్రభుత్వంలో ఏటిగట్ల పటిష్టంపై దృష్టి
> రూ.247 కోట్లతో ప్రతిపాదనలు



గంటిపెదపూడి వద్ద బూరుగులంక రేవు నుంచి అవతలి గ్రామాలకు పడవ ప్రయాణం

వారధి ఉండుంటే..

వరద బెడద చాలావరకు తప్పుతుంది
ఒక అడుగు ముందుకు..పది అడుగులు వెనక్కి అన్నట్టు వంతెన నిర్మాణం
బ్రిడ్జి పూర్తయితే వరద సమయంలో ప్రమాదాలను నివారించొచ్చు

పి.గన్నవరం, జూలై 30: గంటిపెదపూడి శివారు బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక ప్రాంత వాసులు వరదల కాలంలో దశాబ్దాల కాలంగా అవస్థలు పడుతున్నారు. గోదావరికి వరదలు సమయంలో ఎర్రనీరు వచ్చినప్పుడు మొదలైన అవస్థలు తెల్ల నీరు వచ్చే వరకు కొనసాగుతాయి. అయితే 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం లంక గ్రామ వాసులకు వంతెన ఏర్పాటు నిమిత్తం డిజైన్, పర్యావరణ అనుమతులతో సహా పూర్తి చేసి రూ.49.50 కోట్లు అంచన వ్యయంతో టెండర్లు పిలిచింది. చివరి దశలో 2019 ఎన్నికలు రావడంతో వంతెన నిర్మాణం టెండర్ల దశలో ఆగిపోయింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం చివర్లో ఒక ప్రయివేటు కంపెనీకి వంతెన నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. వైసీపీ ప్రభుత్వం మాత్రం వంతెన నిమిత్తం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఇప్పటి వరకు 20 శాతం వరకు పనులు పూర్తికావడంతో పాటు 2025 నాటికి వంతెన అందుబాటులోకి రావాలన్నది అగ్రిమెంటు నిర్ణయం. కూటమి ప్రభుత్వం త్వరితగతిన నిధులు విడుదల చేసి వంతెనను లంక గ్రామస్థులకు అందుబాటులోకి తెస్తే లంక గ్రామాల ప్రజలు ఈ ప్రమాదాలు నుంచి బయటపడతారు. వంతెన అందుబాటులోకి వస్తే ధవళేశ్వరం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసినప్పటికి ఇళ్ల చుట్టూ నీరు చేరుతుంది తప్ప రాకపోకలకు ఆటంకం ఉండదు. నదీపాయలో రాకపోకలకు చెక్ పెట్టొచ్చు..ఉడిమూడిలంకలో జరిగిన పడవ ప్రమాదాలు పునరావృత్తం కాకుండా చూసుకోవచ్చు..



గంటిపెదపూడి వద్ద నిర్మాణంలో ఉన్న హైలెవెల్ బ్రిడ్జి

నిర్లక్ష్యం ఖరీదు.. ఉడిమూడిలంక పడవ ప్రమాదం

సాధారణంగా నాలుగు గ్రామాలకు చెందిన ప్రజలు మాత్రం బూరుగులంక రేవు నుంచే రాకపోకలు సాగిస్తారు. బూరుగులంక రేవుకు వాటర్ ప్యాకెట్లు చేరడానికి ఏటిగట్టు దిగువున కాజ్‌వే నీటమునిగింది. దీంతో ట్రాక్టరు కూడా వెళ్లే మార్గం లేక వాటర్ ప్యాకెట్లను మాత్రం ఉడిమూడిలంకకు తరలించేందుకు లంక ఎదురుగా ఉడిమూడి శివారు చింతావారిపేటకు సమీపంలో ఏటిగట్టు దిగువున మార్గాన్ని ఎంచుకున్నారు. ఆ ప్రదేశంలో వరదల సమయంలో ఎగువ నుంచి వచ్చే నీటీవేగం ఏటిగట్టుకు తాకకుండా వేగాన్ని తగ్గించేందుకు గ్రోయిన్స్ నిర్మాణం చేశారు. వాటర్‌ప్యాకెట్లతో బయలుదేరిన పడవ 20 మీటర్ల దూరంలోనే గ్రోయిన్స్‌కు తగిలి కుదుపు రావడంతో ప్రమాదం సంభవించిందని చెబుతున్నారు. పడవ సామర్థ్యంతో పనిలేకుండా పరిమితికి మించి సుమారు 200 వాటర్ బస్తాలు వేయడంతో పడవ అదుపు తప్పిందని అంటున్నారు. అయితే వారు లైఫ్ జాకెట్లు ధరించినప్పటికి నిబంధనలు ప్రకారం విపత్తుల సమయంలో నాటుపడవలపై ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా రక్షణ బృందాలు అవసరం.. అయితే వారు లేకపోవడంతో ఆ యువకుడు ప్రవాహంలో కొట్టుకుపోయాడని, రక్షణ బృందాలు ఉంటే యువకుడిని కాపాడేవారని చెబుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానికంగా సహజ వాయువుల నిక్షేపాలు బయటికి తీస్తున్న ప్రాంతాల్లో నైపుణ్యత అవసరం లేని పనులు నిరుద్యోగ యువతకు కల్పిస్తూ ఉద్యోగ అవకాశాలు పెంపొందించే ఏర్పాట్లు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం చమురు, సహజవాయువుల సంస్థ తూర్పు ప్రాంత ఆఫ్‌సోర్ ఎసెట్ ప్రతినిధులు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓడలరేవులో గ్యాస్ ప్రాసెసింగ్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓఎన్జీసీ అధికారులు వివరించారు. ఓడలరేవులో 300 ఎకరాల విస్తీర్ణంలో గల ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాల గురించి ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. పది కిలోమీటర్ల పరిధిలో 42 గ్రామాలు ఉన్నాయని, ప్రాజెక్టు కారణంగా పర్యావరణానికి సంబంధించి తాగునీరు, కాలుష్యం, భూములు నిస్సారంగా మారడం, జీవ వైవిధ్యానికి తలెత్తే ఇబ్బందులు తదితర అంశాలపై అన్ని కోణాల్లోను సర్వే చేపట్టాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రధానంగా వ్యవసాయ భూములు కలుషితం కాకుండా చూడాలన్నారు. గ్రామాల్లో సీఎస్సార్ నిధులను వెచ్చించి విద్య, వైద్య, మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మెకానికల్ సీజీఎం నిర్మల్‌కుమార్, హెచ్ఎస్ఈ హెడ్ మేనేజర్ భాస్కరరావు, ప్రొడక్షన్ జనరల్ మేనేజర్ ఎ.గుప్తా, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ సందీప్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు పాల్గొన్నారు.

ఆగస్టు 15 వేడుకలకు సిద్ధం కావాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): నూతన ఒరవడికి నాంది పలుకుతూ ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకలను క్రమపద్ధతిలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధం కావాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో గేయ, నృత్య రూపకాలు కాకుండా స్వాతంత్రోద్యమ సంఘటనలు, సన్నివేశాలు తెలిపే అంశాలపై నిర్వహించాలని డీఈవోను ఆదేశించారు. విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన ఉద్యోగ, అవార్డు గ్రహీతలకు గ్యాలరీల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. జీఎంసీ బాలయోగి స్టేడియంలో అవసరమైన మేర రైన్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటుచేయాలని ఆర్డీవోకు సూచించారు. పాఠశాల విద్యార్థులకు బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. శకటాల ప్రదర్శన అంశంపై ఆగస్టు మొదటివారంలో నిర్వహించే సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఎస్పీ బి.కృష్ణారావు, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



అల్లవరం: వైనతేయ వరదలో మత్స్యకార ఇళ్లు

వరద తగ్గుముఖం

వార్తలు 8లో..

ఊపిరి పీల్చుకున్న లంక గ్రామాలు
పలు గ్రామాల్లో పడవలపైనే రాకపోకలు


వరదకు కొట్టుకుపోయిన కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారి

రహదారి ఛిద్ర(త్ర)ం



గోదావరి వరదలకు రహదారులు ఛిద్రమయ్యాయి. ముఖ్యంగా కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారి పోలిపాక వద్ద గోదావరి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో వరద తగ్గుముఖం పట్టినప్పటికీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. పోలిపాక గ్రామానికి వెళ్లే సీసీ రోడ్డు వరద తాకిడికి నిట్టనిలువుగా చీలిపోయింది. (కుడివైపు చిత్రం)

- కూనవరం


బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

తగ్గుతున్న గోదావరి

ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

12.60 అడుగులకు తగ్గిన నీటిమట్టం

11.19 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

భద్రాచలం వద్ద స్వల్పంగా పెరుగుతున్న వరద

ధవళేశ్వరం, జూలై 30: ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. మంగళవారం ఉదయం ఆరు గంటలకు నీటిమట్టం 13.70అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. గంటకు ఒక్క పాయింటు చొప్పున క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం రాత్రి ఏడు గంటలకు 12.60 అడుగులకు చేరుకోగా 11,19,425 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. బుధవారం నాటికి మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించే స్థాయికి నీటిమట్టం తగ్గవచ్చని అధికారుల అంచనా. ఎగువన తెలంగాణ పరివాహకంలోని లక్ష్మి బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయడంతో కాళేశ్వరం వద్ద నీటిమట్టం పెరుగుతోంది. ఆ ప్రభావంతో దిగువన భద్రాచలం వద్ద నీటిమట్టం పెరగడంతో మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం రాత్రి ఏడు గంటలకు నీటిమట్టం 43.60 అడుగులుగా నమోదైంది.

మొన్న...



తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నుంచి ఒడిసాకు వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ నవీన్ నిద్రమత్తు కారణంగా చింతూరు మండలం నిమ్మలగూడెం-కుయుగూరు మధ్య జాతీయ రహదారిపై వరద నీటిలో మునిగిపోయింది. అతడు ఆదివారం రాత్రంతా తాటిచెట్టుపై ఉండి ప్రాణాలతో బయటపడిన విషయం విదితమే. రహదారిపై వరద నీరు మంగళవారం క్రమంగా తగ్గడంతో టిప్పర్ బయటపడింది.

- చింతూరు

నేడు...




దాతకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఈవో కిషోర్‌కుమార్

అన్నదాన భవన నిర్మాణానికి
రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, జూలై 30: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరానికి చెందిన దాడిశెట్టి విష్ణు చక్రం-రమాజ్యోతి దంపతులు రూ.1,00,500 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటాన్ని ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ అందించారు. వివిధ సేవల ద్వారా మంగళవారం రూ.2,14,376 ఆదాయం లభించినట్టు ఆయన చెప్పారు.



అపర్ణాదేవికి కదంబ పుష్పాలతో పూజ

గొల్లప్రోలు రూరల్, జూలై 30: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి మంగళవారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి కుంకుమ పూజ, సహస్ర నామార్చన జరిపి కదంబ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



నాటు తుపాకీతో ఇద్దరి అరెస్టు

గోకవరం, జూలై 30: నాటు తుపాకీ కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను గోకవరం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ కె.నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గంగవరం మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన పాతర అప్పారావు, రంపచోడవరం మండలం గొట్లగూడెం గ్రామానికి చెందిన పోడియం పొట్టిదొర గోకవరం మండలం కొత్తపల్లి గ్రామ శివారులో నాటు తుపాకీతో సంచరిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన వీఆర్వో ఎం.వెంకట్రావు ఫిర్యాదు మేరకు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారి నుంచి నాటు తుపాకీ, మోటారు సైకిలు స్వాధీనం చేసుకున్నారు. సూరంపాలెం ప్రాజెక్టు పరసర ప్రాంతాల్లో వేటాడేందుకు వెళ్లి అక్కడ వేపచెట్టు కింద నాటు తుపాకీతో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు నిద్రపోయినట్టు విచారణలో తేలింది.

కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయ క్లర్క్‌పై విచారణ

కాకినాడ క్రైం, జూలై 30: జిల్లా ఎస్పీ కార్యాలయంలో డిస్ప్యాచ్ విభాగంలో పనిచేస్తున్న జి.శ్రీనివాస్ ఉన్నతాధికారులకు వచ్చిన లేఖలను విప్పి చదువుతూ వాటిని ఫొటో తీసి చివరికి అధికారులకు పట్టుబడ్డాడు. శ్రీనివాస్ లెటర్ల ఎన్వలప్ కవర్లను తెరిచి వాటి లోపల ఉన్న లేఖలను ఫొటో తీసి తిరిగి అంటించి ఏ అధికారి లెటరు ఆ అధికారికి పంపిస్తున్నాడు. కొత్త ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు వచ్చిన లేఖను శ్రీనివాస్ చదివి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. సోమవారం సాయంత్రం ఎస్పీకి వచ్చిన లెటర్ ఎన్వలప్ కవరు అతికిన విధానాన్ని ఎస్పీ నిశితంగా పరిశీలించారు. కవరు జిగురు అప్పుడే అటించి ఉన్నట్లు గమనించారు. దీంతో డిస్ప్యాచ్ క్లర్క్ శ్రీనివాస్‌ను పిలిచి తాను చేసిన తప్పును తన నోటితో చెప్పించారు. అనంతరం శ్రీనివాస్‌కు చార్జ్ మెమో ఇచ్చారు. ఇదే తరహాలో గ్రీవెన్స్‌కు వచ్చే పిటీషన్‌లు శ్రీనివాస్ తెరిచి చూస్తున్నాడనే అనుమానాలు రేకెత్తడంతో అతడిపై విచారణ చేయాలని ఎస్పీ ఆదేశించారు.



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద యువకుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం, ఉడిమూడిలో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

విషాదాంతం

పడవ ప్రమాదంలో గల్లంతైన విజయకృష్ణ మృతదేహం పి.గన్నవరం అక్విడెక్టు వద్ద లభ్యం

పి.గన్నవరం, జూలై 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటి పెదపూడి వద్ద పడవ ప్రమాదంలో గల్లంతైన చదలవాడ విజయకృష్ణ ఆచూకీ పి.గన్నవరం అక్విడెక్టు వద్ద మంగళవారం లభ్యమైంది. అక్విడెక్టు కాల్వ తొట్టెకు అడ్డుపడిన చెత్తలో మృతదేహాన్ని గుర్తించిన బంధువులు అధికారులకు సమాచారం అందించారు. ఎస్ఐ బి.శివకృష్ణ అక్విడెక్టు వద్దకు చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో సుమారు రెండు గంటల పాటు కష్టించి బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని అక్విడెక్టు వద్ద ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరిశీలించి ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. కాగా విజయకృష్ణ కుటుంబాన్ని ఉడిమూడిలో కోనసీమ జిల్లా కలెక్టర్ ఎం.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించి ప్రభుత్వం అందించిన రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎంతవరకు చదువుకున్నావని మృతుని సోదరిని కలెక్టర్ అడిగి ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తానని చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఆర్థిక సాయం అందించామని ఎమ్మెల్యే చెప్పారు. నెల వ్యవధిలో మృతుడు సోదరి కళ్యాణికి ఉద్యోగం వచ్చేలా చూస్తామన్నారు. తహసీల్దారు ఎస్‌కే హుస్సేన్, సర్పంచ్ ఎస్.ప్రసన్నకుమార్, మద్దా చంటిబాబు, వాసంశెట్టి కుమార్, తాటికాయల శ్రీనివాసరావు, ఏసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

ఐదుగురు అరెస్టు.. 75 సెల్‌ఫోన్లు స్వాధీనం

అమలాపురం టౌన్, జూలై 30: ఆన్‌లైన్ బెట్టింగ్ జరుగుతోందన్న సమాచారంతో అమలాపురం పట్టణ పోలీసులు పక్కా ప్రణాళికతో దాడి చేశారు. బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. సీఐ కె.క్రిస్టఫర్ తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న అంబికా లాడ్జిలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. అమలాపురం రూరల్ భట్లపాలెం గ్రామానికి చెందిన మోటూరి దొరసత్యసూర్య మణికంఠ అలియాస్ నాని (25), మోటూరి మధుపవన్ అలియాస్ సతీష్ (23), ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన భలేప్రవీణ్‌బాబు (27), భీమవరం సమీపంలోని గునుపూడికిచెందిన పంజా సాయినరసింహ అలియాస్ (నాని) (19), గురజాపు సూర్యప్రభు అలియాస్ సూర్య (21)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఐదు ల్యాప్‌టాప్‌లు, 75 సెల్‌ఫోన్లు 15 సిమ్‌కార్డులు, 19 బ్యాంక్ చెక్‌బుక్‌లు, 25 ఏటీఎం కార్డులు, 7 నోట్‌బుక్‌లు, ఒక వైఫై రూటర్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం అమలాపురం కోర్టులో హాజరుపరిచారు. గూగుల్ ప్లేస్టోర్‌లో ఉన్న యాప్‌ల్లోకి వాట్సాప్ లింకుల ద్వారా ప్రవేశించి బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు గుర్తించారు. ఆ యాప్‌లను తొలగించేందుకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గూగుల్‌కు లేఖలు పంపించామన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాను అరెస్టు చేసిన పోలీసులను ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.


ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

సుబ్రహ్మణ్యం కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా కృషి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

కాకినాడ సిటీ, జూలై 30: హత్యకు గురైన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్‌గా పని చేసిన తమ కుమారుడు సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసిన వారికి శిక్షపడేలా చేసి తమకు న్యాయం చేయాలని అతని తల్లిదండ్రులు మంగళవారం ఎమ్మెల్యే కొండబాబును కలిసి విన్నవించారు. బాధిత కుటుంబం పరిస్థితిని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ ఎమ్మెల్యేకు వివరించారు. అప్పట్లో సుబ్రహ్మణ్యం హత్య ఘటన సమయంలో బాధిత కుటుంబా నికి అండగా నిలబడిన కొండబాబు ప్రస్తుతం అధికారంలో ఉన్నందున సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి దోషులకు శిక్షపడేలా చూడాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే కొండబాబు సానుకూలంగా స్పందిస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, నగర ఉపాధ్యక్షుడు బంగారు సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండబాబుతో సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు

కరెంట్ షాక్‌తో పశ్చిమ బెంగాల్ వాసి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు.. టవర్లపై ఎర్త్ వైర్ లాగుతుండగా ఘటన

కరప, జూలై 30: కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్ట పంట పొలాల్లో మంగళవారం ఉదయం కరెంట్ షాక్ తగిలి పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎనిమిది మంది కూలీలు అరట్లకట్టలో ట్రాన్స్‌కోకు చెందిన 132/11 కేవీ విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. దీనిలో భాగంగా అక్కడున్న నాలుగు టవర్లలో రెండు టవర్ల మీద ముగ్గురేసి చొప్పున ఎక్కి ఎర్త్ వైరును లాగుతున్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఎలక్ట్రికల్ ఇండక్షన్ (విద్యుత్ ప్రేరణ) కలగడంతో రెండు టవర్ల మీద ఉన్న కూలీలు ఎర్త్ వైర్‌ను వదిలేశారు. అదే సమయంలో కింద పనిచేస్తున్న షేక్ షహిదుల్(20)పై ఎర్త్ వైరు పడడం, అతను బురదలో ఉండడంతో విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అక్కడే ఉన్న మరో కూలీ కూడా షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. షహిదుల్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మరో క్షతగాత్రుడు ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

షహిదుల్ మృతితో సహచర కూలీలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కూలీల్లో మృతుడి సోదరులు కూడా ఉన్నట్టు తెలిసింది. వారు పశ్చిమ బెంగాల్‌లో ఉన్న షహిదుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జిల్లాకు చెందిన ఒక ప్రజాప్రతినిధి బంధువు కాంట్రాక్టర్‌గా ఈ పనులు చేయిస్తున్నట్టు తెలిసింది. దీంతో విషయం బయటకు పొక్కకుండా ట్రాన్స్‌కో అధికారులు ప్రయత్నించినట్టు సమాచారం. కరప పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.



ప్రేమించానని వంచన

» తట్టుకోలేక యువతి ఆత్మహత్య
» యువకుడి అరెస్టు... రిమాండుకి తరలింపు

రాజమహేంద్రవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి ఆత్మహత్యకు కారణమైన యువకుడిని అరెస్టు చేశామని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబికానగర్‌లో నివసిస్తున్న 29ఏళ్ల దళిత యువతి సీతానగరం మండలం వంగలపూడికి చెందిన 22ఏళ్ల షేక్ నాగూర్‌బాబు నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెద్దలకు తెలియడంతో ఏడాది తర్వాత పెళ్లి చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో ఆమెతో నాగూర్ అనేక విధాలైన లోన్లు పెట్టించాడు. ఆ విధంగా మొత్తం రూ.11,97,417 తన సొంతానికి వాడుకున్నాడు. తర్వాత ఆమెను వదిలించుకోడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఉద్దేశపూర్వకంగా ఆమెను కులం పేరుతో బూతులు తిట్టడంతో పాటు తీవ్రమైన మానసిక వేదనకు గురిచేశాడు. దీంతో గత నెల 29వ తేదీ అర్ధరాత్రి సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మరణించింది. యువతి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని డీఎస్పీ పేర్కొన్నారు. ఆమె హ్యాండ్ బ్యాగ్‌లో సూసైడ్ నోట్ ఉండడంతో పాటు పలు విషయాలు వెలుగు చూశాయన్నారు. సాక్ష్యాధారాలను సేకరించి నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

వివాహం కావట్లేదన్న మనస్తాపంతో
తమ్ముడిపై కత్తితో అన్న దాడి

కొత్తపల్లి, జూలై 30: ఇంట్లో అందరికీ వివాహాలు జరిగి మధ్యలో ఉన్న తనకు వివాహం కావట్లేదన్న మనస్తాపంతో సొంత తమ్ముడిపై అన్న బండ కత్తితో దాడి చేసిన ఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం శ్రీరాంపురంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీరాంపురం గ్రామానికి చెందిన పిర్ల రామకృష్ణ కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ముల మధ్యవాడు. పెద్ద కుమారుడికి, చిన్న కుమారుడికి వివాహాలు జరిగాయి. మధ్యలో ఉన్న వివాహం కాని రామకృష్ణకు ఫిట్స్ రావడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. రామకృష్ణ అన్న కుమారునికి ఆరోగ్యం బాగోక మూడు రోజులుగా కాకినాడ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అన్న రామకృష్ణకు సోదరుడు సత్తిబాబు మంగళవారం మధ్యాహ్నం భోజనం క్యారేజీ తీసుకొచ్చాడు. మూడు రోజుల పాటు తనకు తిండి, తిప్పలు లేవని, ఒంటరిగా వదిలేశారని కోపోద్రిక్తుడైన రామకృష్ణ తమ్ముడు సత్తిబాబు మెడపై బండ కత్తితో దాడి చేశాడు. బాధితుడిని పిఠాపురం ఆసుపత్రికి తరలించారు. కొత్తపల్లి పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

ఐటీడీఏలకు
మళ్లీ మహర్దశ

రంపచోడవరం, జూలై 30: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మూడు ఐటీడీఏలకు మళ్లీ మహర్దశ పట్టనుంది. మంగళవారం అమరావతిలో గిరిజన సంక్షేమం, అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించి మంత్రి గుమ్మడి సంధ్యారాణికి, ఇతర ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. 2014-19 కాలంలో రూపొందించిన అభివృద్ధి, సంక్షేమ ప్రణాళికలు వైసీపీ పాలనలో మూలనపడడం, గిరిజనులు ఐటీడీఏలకు దూరమవ్వడం వంటి అంశాలను ముఖ్యమంత్రి సీరియస్‌గా తీసుకున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో గిరిజన సహకార సంస్థ, ట్రైకార్ వంటి వ్యవస్థలు అలంకారంగా మారి గిరిజనుల జీవన ప్రమాణాలను సైతం దెబ్బతీశాయి. ముఖ్యంగా గత ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమాన్ని ఆశించి రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏలకు వచ్చే గిరిజనుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఒక విధంగా ఐటీడీఏలు ఉన్నాయన్న విషయాన్నే గిరిజనులు విస్మరించే పరిస్థితులున్నాయి.

విద్య, వైద్య రంగాల్లో గిరిజనులకు అందాల్సిన అనేక ప్రయోజనాలు 2019 తర్వాత అంతగా అందలేదు. ఐటీడీఏ లను ఆశ్రయించినా తగిన న్యాయం జరగని దుస్థితి గిరిజనులను అనేక ఇబ్బందులకు గురిచేసింది. ఈ విషయాలను గత ఐదు సంవత్సరాల ప్రగతి నివేదికల ద్వారా తెలుసుకున్న సీఎం చంద్రబాబు సదరు లోపాలపై అధికారులను నిలదీశారు. భవిష్యత్తులో ఐటీడీఏల నుంచి గిరిజనులకు ఎటువంటి అసౌకర్యాలు కలగరాదని, మరింత ఉత్తమంగా ఐటీడీఏల నుంచి సేవలు అందేలా చూడాలని, ఎక్కడా కూడా ఆరోగ్య సేవల కోసం గిరిజనులు డోలీలపై తరలించడం వంటి పరిస్థితులు కలగరాదని సూచించారు.

అల్లూరి జిల్లాకు వరద సాయం
రూ.10 కోట్లు విడుదల

కలెక్టర్ దినేష్ వినతి మేరకు జీవో జారీ చేసిన ప్రభుత్వం

రంపచోడవరం, జూలై 30: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గోదావరి వరదల ప్రభావిత కుటుంబాలకు సహాయం చేసేందుకు ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. అల్లూరి జిల్లాలో పరిస్థితులపై కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రభుత్వానికి నివేదిస్తూ సాయం కోసం రూ.15.29 కోట్ల అవసరమవుతాయన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి రూ.10 కోట్లను వరద సహాయానికి వినియోగించుకోవచ్చని కలెక్టరును ఆదేశించింది. 30 రోజులలోగా ఎవరెవరికీ సాయం అందించారో, దేనికి వెచ్చించారో ప్రభుత్వానికి నివేదించాలని ఆ ఉత్తర్వులో ప్రభుత్వం సూచించింది.

పేదల సొంతింటి కల కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

కొత్తపేట,జూలై30: పేదల సొంతింటి కల కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అన్నారు. మంగళవారం ఆమె కొత్తపేటలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్ని శాఖలను నిర్వీర్యం చేసినా అనుభవజ్ఞుడైన సీఎం చంద్రబాబు కీలకమైన ఐదు హామీలు అమలుకు సంతకం చేశారన్నారు. గ్రామాల్లో 3సెంట్లు, పట్టణాల్లో 2సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించడం, ఇంటి నిర్మాణానికి కేంద్రం, రాష్ట్రం రూ.4లక్షలు కేటాయించడం అభినందించదగ్గ విషయమన్నారు.

తగ్గుతున్న వరద ఉధృతి


ఆత్రేయపురం మండలం తాడిపూడిలో వరద తగ్గుముఖం పట్టడంతో బయటపడుతున్న పంటలు

ముమ్మిడివరం, జూలై 30: గోదావరి ఎగువన వరద ఉధృతి తగ్గడంతో మండలంలోని లంక గ్రామాల్లో క్రమేపీ వరద నీరు తగ్గుతుంది. సోమవారం కన్నా మంగళవారం నాటికి నాలుగు అడుగుల మేర వరద నీటి మట్టం తగ్గింది. దీంతో లంక గ్రామాల్లో నీట మునిగిన రోడ్లు ముంపు నుంచి బయట పడుతున్నాయి. మండలంలో వివేకానంద వారధి నుంచి గురజాపులంక ప్రధాన రోడ్డు చాలా మేర వరద నీటి నుంచి బయట పడింది. కూనాలక రామాలయం, గురజాపులంక తుఫాన్ షెల్టర్ సమీపంలో కొంత మేర రోడ్డు ఇంకా వరద నీటిలోనే ఉంది. మత్స్యకార కాలనీలో కూడా రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. వరద ప్రత్యేక సహాయాధికారి మధుసూదన్, తహసీల్దార్ శ్రీనునాయక్, వీఆర్వోలు లంక గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మంచినీటి సరఫరా, లంక గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి.

నీటిలో నానుతున్న కూరపాదులు

అంబాజీపేట, జూలై 30: వరద ప్రభావం తగ్గుతున్నప్పటికి కాలనీలు ముంపులో నానుతున్నాయి. నదీతీర ప్రాంతాలు వాకలగరువు, తొండవరం, నందంపూడిలోని పలు కాలనీలు జలదిగ్బంధంలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కూరపాదులు నీటిలో నానుతున్నాయి. మూడుగ్రామాల్లో 150ఎకరాలకుపైగా అరటి, కాకర, బీర, దొండ పాదులు నీటిలో కుళ్లిపోయాయి. ఇళ్లచూట్టు నీరున్నా పట్టించుకోవడంలేదని వీఆర్వో ఏడుకొండలుపై నవంద్రువారిపేటకు చెందిన ప్రజలు మండిపడ్డారు.

ఊపిరి పీల్చుకుంటున్న లంక ప్రజలు

మామిడికుదురు, జూలై 30: గోదావరికి క్రమేణా వరద తీవ్రత తగ్గుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వరద తగ్గిన అప్పనపల్లి, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పెదపట్నంలోని లోతట్టు ప్రాంతాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. ఆయాచోట్ల పలు గృహాలు చుట్టూ వరదనీరు ముంచెత్తడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ఉచ్చులవారిపేట మీదుగా బాహ్య ప్రపంచానికి వస్తున్నారు. అప్పనపల్లి కాజ్‌వే పూర్తిగా మునగడంతో రాకపోకలు నిషేధించారు. అప్పనపల్లి బాలబాలాజీస్వామి దర్శనాలను ఆరు రోజులుగా నిలుపుదల చేశారు. మండలంలోని ఆరు గ్రామాలకు చెందిన వరదబాధితులు 5,700మందికి బియ్యం,నిత్యావసరాలు అందించినట్టు తహసీల్దార్ ఎం.మేరికమ్మ తెలిపారు.

కూరగాయల పంటలు నాశనం

కపిలేశ్వరపురం, జూలై 30: గోదావరి వరద మంగళవారం తగ్గుముఖం పట్టింది. వరద తగ్గినా లంక పొలాల్లోని కొబ్బరి, అరటి, కంద, కూరగాయలు పంటలు ముంపు నీటిలోనే ఉన్నాయి. కొబ్బరి, అరటి తదితర పంటలను రైతులు వరద నీటిలోంచి పడవలపై బయటకు తరలిస్తున్నారు. కూరగాయల పంటలు వరద నీటిలో చిక్కుకుని పనికిరాకుండా పోయ్యాయని రైతులుగగ్గోలు పెడుతున్నారు. కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంకలలో అధికారుల బృందం వరదపరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

గ్రామాల్లో వీడని ముంపు

పి.గన్నవరం, జూలై30: నదీపాయలు ఇంకా నిండుగా ప్రవహిస్తున్నాయి. గంటిపెదపూడి, ఉడిమూడి శివారు లంక గ్రామాలతో పాటు శివాయిలంక, చినకందాలపాలెం లంక గ్రామాల ప్రజలు ఇప్పటికే పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. కె.ఏనుగుపల్లి, గంటిపెదపూడి ఏటిగట్టు దిగువున కాజ్‌వేలు, కనకాయలంక కాజ్‌వేపై వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తుంది. కె.ఏనుగుపల్లి కాజ్‌వేపై వరద ఉధృతి తగ్గడంతో పడవలు తిరిగే పరిస్థితులు లేక కాజ్‌వేపైనే రాకపోకలు సాగిస్తున్నారు. లంకలగన్నవరం శివారు జొన్నల్లంక, మానేపల్లి శివారు శివాయిలంక, పల్లిపాలెం తదితర గ్రామాల్లో వరదనీరు రోడ్లపైకి చేరి పలు ఇళ్ల చుట్టూ చేరింది.

నిత్యావసరాల అందజేత

అంతర్వేది, జూలై 30: అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లిలంక, లాకోపేట తదితర ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టింది. తహసీల్దార్ పెద్దిరాజు, ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో నాగప్రసాద్, కార్యదర్శి గంగరాజు, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సచివాలయ ఉద్యోగులు పడవలపై బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి తాగునీరు, ఆహార పొట్లాలను అందించారు. వారం రోజులకు వరద ప్రవాహం నిలకడగా ఉండడంతో లంక వాసులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు.

వరద ముంపులోనే మత్స్యకారుల నివాసం

అల్లవరం, జూలై 30: ఎనిమిది రోజులుగా బోడసకుర్రు పల్లిపాలెంలో 75మత్స్యకార ఇళ్లు వరద నీటిలోనే నానుతున్నాయి. గోపాయిలంక, రెబ్బనపల్లి తదితర గోదావరి తీర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గోపాయిలంక అవుట్‌ఫాల్ స్లూయిస్ తలుపులు పనిచేయగా కుమ్మరి కాలువ డ్రెయిన్‌కు వరద పోటెత్తి కంసాల మామిడి, అల్లవరం పరిసర ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. బోడసకుర్రు పల్లిపాలెం పాఠశాలలో ఎనిమిది రోజులుగా పునరావాస కేంద్రాన్ని నిర్వహిస్తూ బాధితులకు భోజనాలు అందజేస్తున్నారు. తహసీల్దారు పి.సునీల్‌కుమార్,ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పశుగ్రాసానికి కొరత

ఆలమూరు, జూలై 30: గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో మండలంలోని లంక గ్రామాలు ఊపిరిపీల్చుకున్నాయి. బడుగువానిలంక పూర్తిగా వరద నీటి నుంచి బయటపడింది. మండలంలోని లంక గ్రామాల్లో వరదనీరు తగ్గుతుండటంతో పంట నష్టాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. వారం రోజులు వరదనీటిలో పంటలు ఉండిపోవడంతో పంటలకు అధిక నష్టంఉంటుందని భావిస్తున్నారు. గోదావరి లంకప్రాంత వరదనీటితో నిండిపోవడంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. గోదావరి వరద తగ్గుముఖంతో జొన్నాడ వద్ద గోదావరి వరద ఉధృతి తగ్గింది. పుష్కరఘాట్‌లో వరదనీరు తగ్గుతోంది.

తగ్గుముఖం పడుతున్న వరద

యానాం, జూలై 30: యానాంలో వరద తగ్గుముఖం పడుతుంది. రాజీవ్‌గాంధీ బీచ్ పూర్తిగా నీట మునగటంతో పర్యాటక కట్టడాలు వరద ముంపునకు గురయ్యాయి. వరద తగ్గుముఖం పట్టడంతో పలు స్లూయిస్‌ల వద్ద అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. వరద పరిస్థితిపై పరిపాలనాధికారి మునిస్వామి అధికారులతో సమీక్ష చేశారు.

తేరుకుంటున్న లంకలు

ఆత్రేయపురం, జూలై 30: గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాల వాసులు ఊపిరిపీల్చుకున్నారు. కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది. వరద తగ్గుముఖం పట్టడంతో లంకల్లో పంటలు తేరుకుంటున్నాయి. వరద ముంచెత్తడంతో చేతికి అందిన పంటలు కాస్త కొట్టుకుపోయాయి. రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వాడపల్లిలంక, మద్దూరులంకలోని 18కుటుంబాలకు ఒక్కొక్కరికి 25కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

గోశాలకు దాణా అందజేత

అంతర్వేది, జూలై 30: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉన్న గోశాలకు పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లికి చెందిన గుబ్బల రాజేష్-కరుణ దంపతులు 250కిలోల దాణా అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది గుత్తుల శ్రీనివాస్, విష్ణుభట్ల సుందరరావు, జక్కంపూడి మాణిక్యాలరావు, రావి ప్రసాద్, గునిశెట్టి శివ, గోశాల సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

● కౌన్సిల్‌లో 'జనరిక్' మార్పుపై చర్చ
● మారుస్తామన్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
● ఓటింగ్‌తో మార్పు అంశం వాయిదా

జనరిక్ షాపు నిర్వాహకుల మార్పుపై రగడ


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూలై 30: స్థానికకలవపువ్వు సెంటరులో సమీపంలోని మున్సిపల్ స్థలం ప్రస్తుతం చీకటి పడితే గంజాయి, మందుబాబులకు అడ్డాగా మారిందని ఎమ్మెల్యే వేగుళ్ల అన్నారు. ఈప్రదేశంలో పార్కు లేదా ఇతర నిర్మాణాలు చేద్దామని, దీనికి కౌన్సిల్ సభ్యులు సహకరించాలని ఎమ్మెల్యే వేగుళ్ల కోరారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎక్స్ అఫిషియోసభ్యుడు హోదాలో వేగుళ్ల హాజరయ్యారు. ఏడిద రోడ్డులోని అన్నక్యాంటీన్ పునరుద్ధరణకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈసందర్భంగా సభ్యులు ఛైర్‌పర్సన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆగస్టు 15న అన్నక్యాంటీన్‌ను ప్రారంభిస్తామని వేగుళ్ల చెప్పారు.పట్టణంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదనంగా నిర్మించే సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని సభ్యులు ఎంపిక చేయాలని వేగుళ్ల కోరారు. అజెండాలోపొందుపర్చిన జనరిక్ దుకాణం నిర్వాహకుల మార్పును వైసీపీ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. ఈఅంశంపై సమావేశంలో చర్చ వాడివేడిగా సాగింది. టీడీపీ ప్రభుత్వం జనరిక్ మందులు షాపు ఇచ్చినపుడు వైసీపీ ప్రభుత్వం ఎందుకు మార్పుచేసిందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఈఅంశాన్ని వాయిదా వేయాలని వైసీపీ సభ్యులు కోరారు. మెప్మా టీఎం లీడర్ అనంతలక్ష్మీ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న జనరిక్ సంఘ సభ్యులే స్వచ్ఛందంగా తీర్మానం చేసి ఇచ్చారని అందుకే వేరే సంఘానికి కేటాయించామని సమాధానం చెప్పారు. ఇష్టం ఉంటే ఆమోదించాలని లేకుంటే తిరస్కరించాలని వేగుళ్ల సభ్యులకు సూచించారు. ఈఅంశంపై ఛైర్‌పర్సన్ సభ్యులు ఓటింగ్ కోరారు. సభ్యులు వ్యతిరేకించడంతో ఆ అంశాన్ని వాయిదా వేశారు. పట్టణంలో కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ మందపల్లి రవి కోరారు. మున్సిపల్ దుకాణాల ముందు వ్యాపారులు ఆక్రమించటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని టీడీపీ కౌన్సిలర్ యరమాటి గంగరాజు అన్నారు. ఇంకా పలు అంశాలను సమావేశంలో చర్చించి ఆమోదించారు. వైస్‌ఛైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్యబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక విధానం


సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల రామకృష్ణ

రావులపాలెం, జూలై 30: రావులపాలెంలో స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఇసుక విధానం పూర్తిస్థాయిలో పారదర్శకంగా జరుగుతోందని టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ అన్నారు. టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. ఈసందర్భంగా ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వంలో నిల్వఉంచిన ఇసుకను ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. దీంతో స్టాకు పాయింట్ల వద్ద అధికారులు నిర్ణయించిన ధరలకు ఇసుక ఎగుమతులు అవుతున్నాయన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రావులపాలెం ఇసుకపాయింట్ వద్దకు వచ్చి ఇక్కడో ఏదో అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లు మీడియాసమావేశాలుపెట్టి హడావిడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేవీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇసుక, మట్టి, బొండు ప్రకృతి వనరులపై దోచుకోవడం, దాచుకోవడం అలవాటైన మాజీ ఎమ్మెల్యేకు అధికారం కోల్పోయేటప్పటికి ప్రజలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, పాలూరి సత్యానందం, చిలువూరి సతీష్‌రాజు, నందం వీరవెంకట సత్యనారాయణ, సాధనాల శ్రీను, కాసురెడ్డి పాల్గొన్నారు.

275 మెట్రిక్ టన్నుల టీఎమ్మార్ పంపిణీ

అమలాపురం టౌన్, జూలై 30: వరద ప్రభావిత ప్రాంతాల్లోని పశుపోషకులకు 275 మెట్రిక్ టన్నుల టీఎమ్మార్ పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఒక్కో పశువుకు 5కిలోల చొప్పున ఐదు రోజులకు 25కిలోల టీఎమ్మార్‌ను అందజేస్తామన్నారు. గోదావరి వరదలతో పశుపోషకులు పడుతున్న ఇబ్బందులు గుర్తించి టీఎమ్మార్ పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. 14మండలాల పరిధిలోని 54గ్రామాల్లో 10,797పశువులకు ప్రభుత్వం తరపున ఉచితంగా టీఎమ్మార్ అందజేస్తామన్నారు. ఆగస్టు 1న జిల్లాలోని అన్ని వరద ప్రభావిత ప్రాంతాల్లో టీఎమ్మార్ పంపిణీ చేస్తామన్నారు.

సముద్రంలో మృతదేహం లభ్యం

అల్లవరం,జూలై30: ఓడలరేవు సముద్రతీరంలోవైనతేయ వరదకు కొట్టుకువచ్చిన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజోలుకు చెందిన సానబోయిన సత్యనారాయణ(69)గా గుర్తించారు. ఈనెల25న పి.గన్నవరంలో బంధువుల ఇంటికి వెళ్లిన సత్యనారాయణ ప్రమాదవశాత్తు కాలుజారి వరదనీటిలో పడిపోయాడు. మృతదేహాన్ని సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు

క్రీస్తు బోధనలు ఆచరణీయం

కె.గంగవరం, జూలై 30: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని టీడీపీ సీనియర్ నాయుడు మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. మంగళవారం కె.గంగవరంలోని చిన్నమంద చర్చిలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయనకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫెలోషిప్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఫెలోషిప్ అధ్యక్షులు కార్లడేవిడ్ కొమనాపల్లి అధ్యక్షత వహించారు. విక్టర్ నంద, ముంగి యహోసువ, సలాది జక రయ్య, యు.భాస్కరరావు, ఎస్తేరు తాతపూడి పాస్టర్లు పాల్గొన్నారు.

బీజేపీ, టీడీపీ, జనసేన ఫ్లెక్సీ ధ్వంసం

అల్లవరం, జూలై 30: ఫ్లెక్సీ ధ్వంసం విషయంలో రాజకీయ విభేదాలు భగ్గుమన్నాయి. బెండమూర్లంక సెంటరులో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఫొటోలతో స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో వివాదం ఏర్పడింది. దీనిపై టీడీపీ నాయకులు యాళ్ల అబ్బులు, గిడుగు భాస్కరరావు అల్లవరం స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, ఎస్ఐ పి.హరీష్‌కుమార్ మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వరద బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే దాట్ల


వరద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

ముమ్మిడివరం, జూలై 30: వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. లంకాఫ్ ఠాణేలంక, గురజాపులంక, కూనాలంకలలో మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. వరద బాధితులను పరామర్శించి ప్రభుత్వం అందిస్తున్న సాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.3వేలు నష్ట పరిహారం, 25కిలోల బియ్యం, నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ చేశారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌తలో కలిసి లంక భూముల నదీకోత నివారణకు ప్రణాళిక సిద్ధంచేసి రక్షణ చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, అర్ధాని శ్రీనివాసరావు, పిల్లి నాగరాజు, నడిమింటి సూర్యప్రభాకరం, చిక్కాల అంజిబాబు, రంకిరెడ్డి రాంబాబు, గీసాల చంద్రరావు, దూడల స్వామి, గోదశి పుండరీష్, బొక్కా రుక్మిణి, మోర్త ప్రసాద్, దంగేటి శ్రీనివాస్, మిమ్మితి చిరంజీవి, నడింపల్లి శ్రీనివాసరాజు, పళ్ల రాజబాబు, చింతలపూడి కొండబాబు, గోదశి గణేష్, తొత్తరమూడి జ్యోతిబాబు, బూరుగ కల్యాణి, నేలపాటి వంశీ ఉన్నారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ఐ.పోలవరం, జూలై 30: గోదావరి ముంపు బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. కొమరిగిరిగట్టువారిపేట వరద బాధితులను మంగళవారం ఆయనపరామర్శించారు. బాధితులకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, సర్పంచ్‌లు వరసాల విజయచాముండేశ్వరి, బీర సత్యకుమారి, నాయకులు నాగిడి నాగేశ్వరరావు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, చెల్లి అశోక్, ఆకుల సత్తిబాబు, సాకా సీతాదేవి, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, ఆకుల శివ పాల్గొన్నారు.

పాము కాటుకు గురైన పవన్‌సాయి

అంతర్వేది, జూలై 30: అప్పనరామునిలంక వరద ప్రాంతంలో మంగళవారం గడ్డి కోసేందుకు వెళ్లిన దొంగ పవన్‌సాయి పాము కాటుకు గురయ్యాడు. వరద ప్రాంతాల్లో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది సకాలంలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం 108లో రాజోలుతరలించారు. మాజీ సర్పంచ్ బర్రే శ్రీను, ఏపీవో నాగప్రసాద్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను తక్షణం పూర్తి చేయండి

ఆలమూరు, జూలై 30: గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు తక్షణం పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ గతంలో మంజూరైన పథకాల్లో కొన్ని పనులు అసంపూర్తిగా నిలిచిపోయ్యాయని, వాటిపై దృష్టిపెట్టి పూర్తిచేయాలని దీనికి తాను పూర్తిగా సహకారం అందిస్తానన్నారు. అయితే పనులు ప్రారంభించని పనులు ప్రారంభించవద్దని సూచించారు. గ్రామాల్లో చేపట్టిన జలజీవన పథకం పనులు సక్రమంగా జరగలేదని, వాటి వల్ల తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నామని సర్పంచ్‌లు సంగితసుభాష్, గుణ్ణం రాంబాబు ఆవేదనవ్యక్తం చేయడంతో తక్షణం వాటి కాంట్రాక్టర్‌తో పనులు పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పద్మకు ఎమ్మెల్యే బండారు సూచించారు. ఆర్‌అండ్‌బీ రోడ్లకు త్వరితగతిన రిపేర్లు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని ఆ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఎంపీడీవో రోజ్‌మేరీ, తహశీల్దార్ అనిల్‌కుమార్. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు బియ్యం పంపిణీ

అమలాపురం రూరల్, జూలై 30: గోదావరి వరదలతో అప్పర్‌కౌశిక మేజర్ డ్రెయిన్ పొంగి ప్రవహించడంతో బండారులంకలోని పలు కాలనీలు ముంపులో చిక్కుకున్నాయి. ముంపు బాధితులను మంగళవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సునీత, నాయకులు లింగోలు పండు, కొప్పుల నాగమానస, బట్టు పండు, బళ్ల వెంకటేశ్వరరావు, మంద గెద్దయ్య, కొల్లి అంబేడ్కర్, బళ్ల వీర్రాజు, కాశిన బాబి, బళ్ల శ్రీనివాసచక్రవర్తి, ఎంపీడీవో జి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నంబర్‌వన్ పాఠశాలగా తీర్చిదిద్దుతా

ముమ్మిడివరం, జూలై 30: విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను పూర్తిస్థాయిలో సమకూర్చి ఠాణేలంకలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను నంబర్‌వన్ పాఠశాలగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.భవానీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, తాడిన రసింహారావు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, గుద్దటి జమ్మి, దాట్ల బాబు, దూడల స్వామి, గోదశి పుండరీష్, పిల్లి నాగరాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	ఆపరేషన్ రావణ
శ్రీలలిత	పురుషోత్తముడు
శేఖర్ స్క్రీన్-1	డార్లింగ్
శేఖర్ స్క్రీన్-2	డెడ్ పూల్
రమా	రాయన్
గణపతి	హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	డెడ్ పూల్

వరద ప్రాంత రైతులకు అండగా ప్రభుత్వం



ఆలమూరు, జూలై 30: గోదావరి వరదలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బడుగువానిలంకలో మంగళవారం గోదావరి వరదలకు ముంపునకు గురైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించి కొద్దిసేపు రైతులతో మాట్లాడారు. పంట నష్టాలను పూర్తిస్థాయిలో గుర్తించి నష్టపోయిన ప్రతీ రైతుకు ప్రభుత్వం పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే బండారు రైతులకు హామీ ఇచ్చారు. బండారు వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.

పశువుల దాణా, మందులు పంపిణీ

కొత్తపేట, జూలై 30: వానపల్లి శివారు నారాయణలంక, సత్తెమ్మలంక ప్రాంత ముంపు బాధితులను మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించారు. బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. అనంతరం ముంపు ప్రాంత పాడి రైతులకు పశువుల దాణా, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వానపల్లి సర్పంచ్ పల్లి భీమారావు, ఎంపీటీసీ బళ్ల సుధారాణి, గనిశెట్టి వీరేష్, మాకే నాగభూషణం, నూకల వీరన్న, దూనబోయిన బుజ్జి, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

సముద్ర మొగలకు శాశ్వత పరిష్కారం చూపాలి

అమలాపురం టౌన్, జూలై 30: సముద్ర మొగలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ది కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. సముద్ర తీరంలో సహజ సిద్ధంగా ఏర్పడ్డ పర్ర భూముల ఆక్రమణలు తొలగించి డ్రెయిన్లు ఆధునికీకరించాలని కోరుతూ సంఘం అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం, కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గతంలో కూనా ఓషియోగ్రఫీ, ఉస్మానియా ఓషోగ్రఫీ విభాగాలు నిర్వహించిన సర్వేలు, నిపుణుల సూచనల మేరకు సముద్ర మొగల వద్ద ముంపునీరు దిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, ఆకుల శ్రీనివాసరావు, ఆకుల లక్ష్మణరావు, పొలమూరి మోహన్‌బాబు, దామిశెట్టి చంటి, సూదా చిన్నబ్బులు, ఆకేటి బాబులు, రాయపురెడ్డి శ్రీనివాసరావు, అడబాల సత్యనారాయణ, చీకట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నిరసనకు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సంఘీభావం తెలిపారు.

కూటమి ప్రభుత్వం విద్యకు పెద్ద పీట

రాయవరం, జూలై30: సీఎంచంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేశ్ విద్యకు పెద్ద పీట వేస్తున్నస్తున్నారని టీడీపీసీనియర్ నేత వుండవిల్లిరాంబాబు అన్నారు. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ ఎం.రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లా డారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కూటమి నేతలు దేవిశెట్టి చిన్ని, వల్లూరి శ్రీనివాస్, అధ్యాపకుడు డీవీవీ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పాడైపోయిన తూరను తొలగించాలని ఆందోళన

మామిడికుదురు, జూలై 30: నగరంలోని చాకలిచెరువు ప్రాంతంలో ఉన్న శిథిలమైన ముగురు తూరను తొలగించి ఇబ్బందులను గట్టెక్కించాలని రైతులు మంగళవారం ఆందోళన చేశారు. పది రోజుల నుంచి చేలల్లో చేరిన వర్షం నీరు దిగే ఆస్కారంలేక ఆకుమడులు దెబ్బతిన్నాయన్నారు. శిథిలమైన తూర స్థానే కొత్త తూరను ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పోస్టల్ ఇన్సూరెన్స్‌తో బహు ప్రయోజనాలు

మండపేట, జూలై30: పోస్టల్ శాఖ అనుసబంధ సంస్థ అయిన ఇండియా పోస్టుపేమెంట్ బ్యాంక్ గ్రూప్ ప్రమాదబీమా పాలసీలను ప్రవేశపెట్టిందని పోస్టల్ ఉద్యోగులు కొండపల్లి సూర్యనారాయణ,కె.వి.నారాయణరావు అన్నారు. స్థానిక పోస్టల్‌శాఖ కార్యాలయం వద్దమంగళవారం ఇన్సూరెన్స్ శిబిరాన్ని పోస్టుమాస్టర్ శివయ్య ప్రారంభించారు. 18-65ఏళ్లవారు ఇన్సూరెన్స్‌కు అర్హులన్నారు. రూ.320పాలసీకి రూ.5లక్షలు, రూ.555పాలసీకి రూ.10లక్షలు ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. ప్రమాదాలకు గురైతే చికిత్స చేయించుకునేందుకు రూ.లక్షవరకు క్లెయిమ్ చేసుకోవచ్చన్నారు. పాలసీదారుడు మరణిస్తే ప్రమాద బీమాతో పాటు కుటుంబంలో పిల్లల చదువు లేదా ఆడపిల్ల వివాహానికి రూ.లక్ష ఇస్తారన్నారు. ఉద్యోగులు ఈశ్వ రరావు, జి.వెంకట్రావు, శ్రీనివాస్, దుర్గాదేవి, ఎం.అనూష, విశ్రాంత పోస్టుమాస్టర్ టి.పుల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో టార్పాలిన్లు పంపిణీ

ముమ్మిడివరం, జూలై 30: రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ ఢిల్లీ నారాయణ ఆధ్వర్యంలో గురజాపులంక, కమిని, వలసలతిప్ప గ్రామాల్లో బాధితులకు మంగళవారం టార్పాలిన్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ముంపు ప్రాంతాల్లో పశువులకు పశుగ్రాసం, దాణా అందిస్తామన్నారు. కార్యక్రమంలో సలాది రామచంద్రరావు, సలాది సీత, బీర చిన్నారావు, గుర్రాల పెదవెంకట్రావు, గొల్లపల్లి రవికుమార్, గుత్తాల మధుబాబు, వాకపల్లి పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వినియోగం మరింత పెంచాలి

అంబాజీపేట, జూలై 30: హైస్కూల్‌లోని 9,10వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లు వినియోగాన్ని మరింత పెంచాలని డీఈవో ఎం.కమలకుమారి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం హైస్కూల్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడారు సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆగస్టు 5నుంచి రాతితో నిర్మాణ పనులు

యానాం,జూలై30: యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఆగస్టు 5 నుంచి రాతితో గోడల నిర్మాణ పనులు జరుగుతాయని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఆయల ప్రాంగణంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, భక్తుల సహకారంతో మొదటిదశలో రూ.7కోట్లతో పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఇప్పటికే ఫౌండేషన్ పూర్తికానున్న నేపథ్యంలో ఆగస్టు 5 నుంచి 120రోజుల్లో రాతితో నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు.

రికార్డ్స్ సాధించిన విద్యార్థులకు సత్కారం

రాయవరం,జూలై30: అవయవ దానంపై అవగాహన కల్పించేందుకు అగ్గిపుల్లల ద్వారా కార్డుబోర్డు తయారుచేసి వివిధ రికార్డులో స్థానం పొందిన రాయవరానికి చెందిన విద్యార్థినులు మల్లిడి స్వర్ణలత, మల్లిడి బాలసాయి వైష్ణవి, డ్రాయింగ్‌టీచర్ ఎం.సత్యానందంలను మంగళవారం రాయవరం శ్రీరామయ్య జడ్పీఉన్నత పాఠశాలలో సత్కరించారు. ప్రాజెక్టు ప్రదర్శించిన 15రోజుల్లోనే తెలుగు బుక్‌ఆఫ్‌రికార్డ్స్, ఇండియా రికార్డ్, మ్యాజిక్ బుక్ ఆప్ రికార్డ్, ఫెంటాస్టిక్ ఎచీవ్మెంట్ అండ్ రికార్డ్స్, హైరెంజ్ బుక్‌ఆఫ్‌రికార్డ్స్, వంటి ఆరు రికార్డుల్లో స్థానం పొందిన సందర్భంగా సర్ణలత, బాలసాయి వైష్ణవితో పాటు ప్రాజెక్టు తయారీకిశిక్షణ ఇచ్చిన డ్రాయింగ్ టీచర్‌ను పాఠశాల హెచ్‌ఎం శాంతి సునీత ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

బాలుడు రత్నాకర్ అదృశ్యం

ఆత్రేయపురం, జూలై 30: అంకంపాలానికి చెందిన మద్దిపాటి సాయిరత్నాకర్(14) అంకంపాలెం శివశివాని స్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాడు. ఈనెల28న స్కూల్ నుంచి ఇంటికి వచ్చి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి హేమలత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.